క్లుప్తంగా

రేపటి నుంచి స్పోర్ట్స్ మీట్

సుల్తానాబాద్: బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ ఈనెల 15, 16ల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యూత్ ఆఫీసర్ ఎం.వెంకటరాంబాబు, టోర్నీ నిర్వాహకుడు మహేశ్ తెలిపారు. సుల్తానాబాద్, జూలపల్లి మండలాల స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాలురకు వాలీబాల్, కబడ్డీ, 400 మీటర్ల రన్నింగ్, షాట్‌పుట్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హామీలను నెరవేర్చి ఎన్నికలు నిర్వహించాలి

జూలపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెళ్ల లక్ష్మీనర్సయ్య డిమాండ్ చేశారు. పెద్దాపూర్‌లో సోమవారం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వివరిస్తూ కాంగ్రెస్ బాకీ కరపత్రాలను వృద్ధులకు పంపిణీ చేశారు. నాయకులు, కార్యకర్తలున్నారు.

రుద్రాభిషేకం

సుల్తానాబాద్: పట్టణంలోని పలు శివాలయాల్లో సోమవారం రుద్రాభిషేకం నిర్వహించారు. అశ్వయుజ బహుళ సప్తమి ఆరుద్ర నక్షత్రం (శివుని జన్మ నక్షత్రం) సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

నేడు షిరిడి సాయిబాబా ఆలయంలో వ్రతం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ గౌతమినగర్‌లోని షిరిడి సాయిబాబా దేవాలయంలో మంగళవారం అశ్వయుజ మాసం బహుళ అష్టమి సందర్భంగా అమ్మ ఒడి వేణుగోపాలస్వామి ఆధ్వర్యంలో అనఘాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో కమిటీ తెలిపింది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు పరిశీలన


పనులు పరిశీలిస్తున్న మహంకాళి స్వామి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ లక్ష్మీపురం, ఎల్కలపల్లిగేట్‌లో నూతనంగా నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి సోమవారం పరిశీలించారు. కన్నూరి శంకర్, కందుల సతీశ్, గుండా రాకేశ్ పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షున్ని కలిసిన క్యాతం

గోదావరిఖని: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా రాంచందర్‌రావును సోమవారం క్యాతం వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించారు.

గుండా మల్లేశ్‌కు నివాళి

గోదావరిఖని: కమ్యూనిస్ట్ అగ్రనేత గుండా మల్లేశ్‌కు సోమవారం స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నివాళి అర్పించారు. చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. నాయకులు కె.కనకరాజ్, గౌతం గోవర్ధన్, రంగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మంథనిరూరల్: గద్దలపల్లి, బిట్టుపల్లి, విలోచవరం గ్రామాల్లో ఇటీవల పలువురు మృతిచెందగా.. వారి కుటుంబాలను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. స్థానిక నాయకులు తదితరులున్నారు.
ముత్తారం: అడవిశ్రీరాంపూర్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డ ఎడ్ల అజయ్(25) కుటుంబాన్ని సోమవారం మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు.

దుర్గానగర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి

కోల్‌సిటీ: గోదావరిఖనిలోని దుర్గానగర్ లేఅవుట్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడిగా పందిళ్ల బుచ్చిరెడ్డి ఎన్నికయ్యారు. కాలనీలో నిర్వహించిన ఎన్నికల్లో బుచ్చిరెడ్డి గెలుపొందగా.. కాలనీలో భారీగా ఊరేగింపు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

కార్యవర్గం ఎన్నిక


కనకయ్య

పెద్దపల్లిరూరల్: పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) మండల అధ్యక్షుడిగా కనకయ్య ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జంగపల్లి నరేశ్, కోశాధికారిగా అశోక్, ఉపాధ్యక్షులుగా ముస్తఫా, సిలువేరు నర్సయ్య, సహాయ కార్యదర్శులుగా మల్లారపు మల్లేశ్, దుర్శెట్టి రాజేశం, సభ్యులను ఎన్నుకున్నారు.

వృద్ధులకు అండగా..

- వయోవృద్ధుల రక్షణ పోషణ సంక్షేమ చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటున్న వైనం
- రోజురోజుకు పెరుగుతున్న దరఖాస్తుల సంఖ్య


కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎఫ్ఆర్‌వో స్వర్ణలత

సుల్తానాబాద్: కని పెంచిన తల్లిదండ్రులను కొందరు ఆదరించడం లేదు. వృద్ధాప్యంలో వారి ఆలనాపాలనా పట్టించుకోవడం లేదు. జీవిత చరమాంకంలో బుక్కెడు అన్నం కోసం ఆరాటపడుతున్నారు. సంతానంపైనే పోరాటం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు చేస్తున్నారు కూడా. అలాంటి వారి కోసం వయోవృద్ధుల రక్షణ పోషణ సంక్షేమ చట్టం -2007 అండగా నిలుస్తోంది. ఇటీవల కలెక్టర్ పలువురు వృద్ధులకు పోషణ కోసం ఆర్థిక సాయం చేయడంతోపాటు పట్టా రద్దు చేసి తిరిగి తండ్రికి చేయడంతో వృద్ధుల్లో చైతన్యం పెరిగింది. ఈ చట్టంపై అవగాహన పెరగడంతో రోజురోజుకు దరఖాస్తుల సంఖ్య పెరుగుతోంది.

కలెక్టర్ రాకతో..

వృద్ధులు తమకు అన్నం పెట్టడం లేదని, దూషిస్తున్నారని ఎక్కువ సంఖ్యలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లేవారు. కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చినా సభ్యులు మారకపోవడంతో ఉన్నతాధికాలను కలవాలని పోలీసులే సూచిస్తుండడంతో ఆర్డీవో, కలెక్టర్లను కలిసి వినతిపత్రాలు అందజేస్తున్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష వచ్చిన నుంచి పలు సమస్యలు పరిష్కారం కావడంతో.. వృద్ధులు కలెక్టరేట్‌కు వచ్చి వినతిపత్రాలు సమర్పిస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే సత్వరమే న్యాయం

సంతానం పట్టించుకోకుంటే పోషణ ఖర్చులు కోరుతూ స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా సంక్షేమ అధికారికి పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలి. అలా వీలు గాని పక్షంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేయొచ్చు. అధికారులు వెంటనే విచారణ చేపట్టి నోటీసులు జారీ చేస్తారు. సంతానాన్ని పిలిపించి కౌన్సిలింగ్ చేస్తారు. తల్లిదండ్రులను పోషించకుంటే ప్రతినెల వారికి పోషణ ఖర్చులు రూ.10వేల లోపు చెల్లించాలని ఆదేశాలిచ్చే అధికారం ఆర్డీవోకు ఉంది. అంతకంటే పైన కావాలంటే కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చు. రెవెన్యూ కోర్టు ఆదేశాలు పాటించని వారికి జైలు శిక్ష, జరిమానా విధిస్తారు. తల్లిదండ్రుల నుంచి ఆస్తులు పొంది వారి పోషణ పట్టించుకోని కుమారుల నుంచి ఆస్తులను స్వాధీనం చేసుకొని తిరిగి తల్లిదండ్రుల పేరిట బదిలీ చేసే అధికారం అధికారులకు ఉంది.

సంవత్సరం	వచ్చిన దరఖాస్తులు	పరిష్కరించినవి	పెండింగ్
2023-24	48	37	11
2024-25	9	5	4

మియాపూర్ గ్రామానికి చెందిన గండి రాజమల్లు అనే వృద్ధుడికి కుమారుడున్నాడు. ఎకరం8గుంటల భూమి ఉండగా.. కొడుకు పట్టా చేసుకొని తనను పోషించడం లేదని, పట్టించుకోవడం లేదని, తన భూమి తనకు పట్టా చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణుకు సోమవారం ఫిర్యాదు చేశారు. వెంటనే ఆర్డీవోకు సిఫారసు చేశారు. సమస్య పరిష్కరించాలని సూచించారు.

లెక్కకు రానివి ఎన్నో..

కుటుంబ సభ్యులు పోషణ భారం ఉందని పోషించకుండా ఉండేవారు అధికంగానే ఉంటారు. పరువు పోతుందని కొందరు బయటకు చెప్పకుండా గ్రామాల్లోనే కుల పెద్దల ముందు పంచాయితీ పెట్టుకొని పరిష్కరించుకుంటున్నారు. కొంతమంది కుటుంబ సభ్యులు సమస్య జటిలం కాకుండా పరిష్కరించుకుంటున్నారు. పోలీస్ స్టేషన్లో కొన్ని పరిష్కారమవుతున్నాయి. లెక్కకు రానివి అధికంగానే ఉన్నాయని చెప్పొచ్చు.

పరిష్కరిస్తున్నాం

దరఖాస్తులు చాలావరకు పరిష్కరించాం. వృద్ధుల పిల్లలను పిలిపించి కౌన్సిలింగ్ చేస్తున్నాం. రానివారి ఇంటికి వెళ్లి కౌన్సిలింగ్ చేసి తల్లిదండ్రులను పిల్లలను కలుపుతున్నాం. మొండిగా ఉన్నవారిని పోషణ కోసం నెలవారీగా ఖర్చులు చెల్లించేలా చేస్తున్నాం. కొందరు సుముఖంగా లేకపోవడంతో ఉన్నాతాధికారులు వారి ఆస్తులను తిరిగి వారి తల్లిదండ్రులకు బదిలీ చేస్తున్నారు.
– బి.స్వర్ణలత, ఫీల్డ్ రెస్పాండ్ ఆఫీసర్, పెద్దపల్లి

పోషకాహారమే ఆరోగ్యానికి మేలు


ధర్మారం: పోషకాహారం పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

ధర్మారం: పోషకాహారం ఆరోగ్యానికి మేలు చేస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బ్లాండీనా అన్నారు. పోషణ మాసం సందర్భంగా పత్తిపాక గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో సోమవారం తల్లులు, బాలింతలు, గర్భిణులకు పోషకాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నూతి మల్లన్న, ఎంఎల్‌హెచ్ శ్రీలత, ఏఎన్ఎం లక్ష్మి, వరలక్ష్మి, వినోద, పద్మ దేవేంద్ర, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
ఎలిగేడు: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని, తల్లులు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఏసీ డీపీవో సంపద అన్నారు. ధూళికట్ట గ్రామంలోని 4 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో పోషణ మాసం నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అక్షరాభ్యాసం జరిపారు. సూపర్‌వైజర్ సూర్యకళ, పంచాయతీ కార్యదర్శి పున్నమయ్య, అంగన్‌వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, రజిత, వెంకటమ్మ, ఓదేశ్వరి, పద్మ, స్వరూప, వసంత, పుష్పలత, సరోజ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక తెలంగాణ చౌరస్తాలో సోమవారం రాత్రి ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందులో ఒకరు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మద్యం మత్తులో ఆటోడ్రైవర్ గణేశ్ ఆటోను అతివేగంగా నడిపాడు. ఈక్రమంలో అదుపుతప్పి తెలంగాణ చౌరస్తాలో తొలుత సైకిల్, టీస్టాల్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో గణేశ్‌కు స్వల్పంగా, ప్రయాణికుడు స్వామికి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ ద్వారా గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఒకరికి జైలు శిక్ష

గోదావరిఖనిటౌన్: అప్పుగా డబ్బు తీసుకొని చెల్లని చెక్కు ఇచ్చిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష విధిస్తూ గోదావరిఖని 2వ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ తీర్పునిచ్చారు. కోర్టు వర్గాల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన జి.రాజేశం అనే వ్యక్తి దగ్గర ఎన్టీపీసీ మల్యాపూర్‌కు చెందిన సంపత్‌కుమార్ అనే వ్యక్తి రూ.8లక్షలు అప్పుగా తీసుకొని రుణ దాతకు బ్యాంకు చెక్కు ఇచ్చాడు. చెక్కును రాజేశం బ్యాంకులో వేయగా.. నిరాదరణకు గురైంది. దీంతో రాజేశం న్యాయవాది ద్వారా కోర్టులో కేసు దాఖలు చేశారు. ఇరు వర్గాల న్యాయవాదులు కోర్టులో సాక్ష్యం దాఖలు చేయగా.. సంపత్‌కుమార్‌పై నేరం రుజువైంది. నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష, 2 నెలల్లో రూ.8లక్షలు నష్టపరిహారం చెల్లించాలని మెజిస్ట్రేట్ సోమవారం తీర్పునిచ్చారు.

పిల్లల ప్రవర్తన, అలవాట్లను గమనించాలి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రవికుమార్

యైటింక్లయిన్‌కాలనీ: తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన, అలవాట్లను ప్రతీ క్షణం గమనిస్తూ ఉండాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రవికుమార్ సూచించారు. సోమవారం యైటింక్లయిన్‌కాలనీ శ్రీవాణి పాఠశాలలో నిర్వహించిన మెంటల్, హెల్త్ అవేర్నెస్ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చిన ఎంబీబీఎస్, ఎండీ(ఉస్మానియా) మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ రవికుమార్ హాజరయ్యారు. పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మణ్‌కుమార్, హెచ్‌ఎం మానస, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సుల్తానాబాద్‌రూరల్: కదంబపూర్ గ్రామంలో అదనపు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సోమవారం అదనపు కలెక్టర్ వేణుకు గ్రామ నాయకులు వినతిపత్రం అందించారు. గ్రామ నాయకుడు కడారి సునీల్, రైతులు రాజయ్య, కొమురయ్య, సంతోష్, బీరయ్య, తిరుపతి, ఐలయ్య, శంకర్ తదితరులున్నారు.
సుల్తానాబాద్: కదంబాపూర్ గ్రామంలో ప్రభుత్వం 2 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కడారి సునీల్ సోమవారం సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి బూరుగు సంతోష్‌కుమార్, రిజిస్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మంథనిరూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న 4 ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. గోపాల్‌పూర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేశ్ తెలిపారు. అక్కెపల్లికి చెందిన వేల్పుల అశోక్, గోపాల్‌పూర్‌కు చెందిన అక్కపాక శశికుమార్, మంథనికి చెందిన రాచర్ల నాగరాజు, ఖమ్మంపల్లికి పర్శ ఓదెలు, పొన్నాల సురేశ్, కటకం సదయ్యపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ట్రినిటిలో ఎంబీఏ ఓరియంటేషన్ డే



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఎంబీఏ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధన కోసం పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యాసంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. డైరెక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ మణిగణేశన్, ఏవో సురేశ్, రాజిరెడ్డి, చొప్పరి వంశీ, హెచ్‌వోడీ ఆరిఫ్, రామ్మోహన్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వారసత్వ ఆస్తి ఆక్రమణకు యత్నం



పెద్దపల్లిరూరల్: రాజీవ్‌నగర్‌లో తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్న వారి నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని వారసురాళ్లు నాగుల విజయకుమారి, సరోజ, పుష్పలత కోరారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆక్రమణదారుడు పలుకుబడిని ఉపయోగించి తమ ఇంటిని కూల్చి భూమిని ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నాడన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు మరమ్మతు


అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

జూలపల్లి: మండల కేంద్రంతోపాటు తెలుకుంట, చీమలపేట గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతుకు నిధులు మంజూరయ్యాయి. చెట్లు, పైకప్పుల తొలగింపు చేపట్టారు. మౌలిక సదుపాయాలు, పైకప్పుల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. సోమవారం ఏసీడీపీవో సంపదకుమారి మరమ్మతు చేపట్టిన జూలపల్లి కేంద్రాన్ని పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకుర్తి: పుట్నూర్ గ్రామ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో మండల ఏఈ మానాల ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కాల్వశ్రీరాంపూర్: ఊశన్నపల్లె గ్రామానికి చెందిన మేడిద అగ్గి మల్లయ్య, పందిల్ల గ్రామానికి చెందిన పోతరవేన శిరీష ఇటీవల మృతిచెందారు. వీరి కుటుంబాలకు స్నేహితులు రూ.10వేల చొప్పున నగదు సాయమందించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.

ఓదెలలో వర్షం

ఓదెల: ఓదెలలో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. సోమవారం కురిసిన వర్షానికి వరి పంటలు పలు గ్రామాల్లో నేలవాలాయి. వరసగా మండలంలో కురుస్తున్న వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మానేరు ప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై రమేశ్ సూచించారు.

దేశ నిర్మాణమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం


సుల్తానాబాద్‌లో ఆర్ఎస్ఎస్ ప్రదర్శన

సుల్తానాబాద్: సంఘటిత దేశ నిర్మాణమే లక్ష్యంగా ఆర్ఎస్ఎస్ పని చేస్తుందని ఆర్ఎస్ఎస్ విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ దావునూరి మురళి అన్నారు. ఆర్ఎస్ఎస్ 100 సంవత్సరాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలో ప్రదర్శన నిర్వహించారు. ప్రియకరావు నాగరాజు, పుట్ట సదయ్య, బొమ్మ దినేశ్,, రాకేశ్, రాజేశ్, రామగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌రూరల్: కందునూరిపల్లె గ్రామంలో అధికారులు ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం చూస్తే ఆటలాడేదేలా అనే సందేహం వ్యక్తమవుతోంది. గత ప్రభుత్వం జాతీయ ఉపాధిహామీ పథకంలో తెలంగాణ గ్రామీణ క్రీడాప్రాంగణాలు ఏర్పాటు చేయాలని సూచించగా.. అధికారులు క్రీడాస్థలం లేకున్నా బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కోల్‌మైన్ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయండి


అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

రామగిరి: రామగుండం కోల్‌మైన్ ప్రాజెక్ట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో రామగుండం–3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్జీ కోల్‌మైన్ ప్రాజెక్ట్, ఓసీపీ–2 ఉపరితల గని పురోగతి పనులు, సీ5 ఓబీ పనులపై డైరెక్టర్ చర్చించి దిశానిర్దేశం చేసి పలు సూచనలు చేశారు. నిర్దేశించిన ఓబీ, బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ఎప్పటికప్పుడు కార్యాచరణ సిద్ధం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. రెస్క్యూ జీఎం కె.శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖర్‌బాబు, కె.యాదయ్య, ఎస్‌వోటూ జీఎంలు ఎం.రాంమోహన్, బండి సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సీహెచ్ వెంకటరమణ, జె.రాజశేఖర్, అధికారులు రాజారెడ్డి, ఐలయ్య, ప్రాజెక్ట్ ఇంజినీర్లు, మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

గని సందర్శన

అడ్రియాల ప్రాజెక్టు గనిని డైరెక్టర్ సందర్శించారు. గనిలో నడుస్తున్న సీమ్ పనులను పరిశీలించారు. లాంగ్‌వాల్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. గని అధికారులతో సమావేశం నిర్వహించారు. గనికి సంబంధించిన వివరాలడిగి తెలుసుకున్నారు. జీఎం నాగేశ్వరరావు, ప్రాజెక్టు అధికారి జనార్దన్, మేనేజర్ పెంచలయ్య, సేఫ్టీ అధికారి కమాలాకర్, రవిచంద్ర, మధు తదితరులు పాల్గొన్నారు.

మురికి నీరు సరఫరా


నల్ల రంగులో సరఫరా అవుతున్న తాగునీరు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2ఏరియా యైటింక్లయిన్ కాలనీ టీ2–క్వార్టర్స్ ఏరియాల్లో సింగరేణి యజమాన్యం సరఫరా చేస్తున్న గోదావరి నది తాగునీరు కొన్ని రోజుల నుంచి మురికిగా సరఫరా అవుతోందని సింగరేణి కార్మిక కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. కనీసం నిత్యావసరాల కోసం పనికి రాకుండా సరఫరా కావడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ఏరియాల్లో తాగునీరు పైపులైన్ పక్కనే డ్రైనేజీ పైపులైన్ ఉండడంతో.. పైపులు పగిలిన చోట తాగునీటిలో డ్రైనేజీ నీరు కలుస్తోందని వాపోతున్నారు. సోమవారం టీ–2–188, 187 క్వార్టర్లలో సరఫరా అయిన నీటిలో చెత్తతోపాటు నల్ల రంగుతో ఇసుక వంటివి వస్తున్నాయన్నారు.

కాలువ తవ్వకంతో పంట నష్టం


కూలిన కాలువను చూపిస్తున్న అశోక్

రామగిరి: సింగరేణి సంస్థ తవ్విన కాలువ ద్వారా పంట నష్టం జరుగుతోందని రత్నాపూర్ పంచాయతీ రాంనగర్‌కు చెందిన రైతు ఉడుత అశోక్ ఆరోపించారు. లద్నాపూర్ భూనిర్వాసితులకు రత్నాపూర్ గ్రామ శివారులో ఇంటి స్థలాలిచ్చారు. రాంనగర్, రత్నాపూర్ పాత ప్లాట్లు, పన్నూరు నుంచి వచ్చే వరద నీరు వెళ్లేందుకు రత్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వరకు భారీ మట్టి కాలువ తవ్వించారు. సిమెంట్ కాలువ నిర్మించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు అది కాస్తా కూలిపోయిందని, ఈ కాలువకు గండి పడి పక్కనే ఉన్న పొలంలోకి వరదనీరు వచ్చి పంట నష్టం జరుగుతోందని అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. జీఎం సుధాకర్‌రావును వివరణ కోరగా.. కాలువ కూలిందని వచ్చిన ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఎస్‌వో షబ్బీరుద్దీన్

రామగిరి: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఏరియా సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్ అన్నారు. సోమవారం సెంటినరికాలనీ రాణిరుద్రమ దేవి స్టేడియంలో ఆర్జీ–3, ఏపీఏ డివిజన్ వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంటల్ స్థాయి హాకీ పోటీలను ప్రారంభించారు. సింగరేణి సంస్థ ఉద్యోగులకు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తోందన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు ఎం.రామచంద్రరెడ్డి, బెల్లం శ్రీనివాస్, డీవైపీఎం వి.సునీల్‌ప్రసాద్, గౌరవ కార్యదర్శి సాయిస్వరూప్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జవ్వాజి అంజయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



పెద్దపల్లిరూరల్: రంగంపల్లికి చెందిన పల్లెర్ల లక్ష్మి ఆటోలో పెద్దపల్లి జెండా చౌరస్తాకు బయల్దేరి తన చేతి సంచిని ఆటోలో వదిలి వెళ్లిపోయింది. డ్రైవర్ కుంబాల ప్రభుదేవ చేతి సంచిని గుర్తించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు విచారణ జరిపి ప్రయాణికురాలిని గుర్తించి చేతి సంచి అప్పగించారు. సంచిలో రూ.17వేల నగదు ఉందని లక్ష్మి తెలిపింది.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా: 9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : కె.శ్రీనివాస్ - 9704047464
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899